నమస్తే తెలంగాణ

# ఖమ్మం

5 | ఖమ్మం, శనివారం 27 జూలై 2024 | KHAMMAM




ఓపీ విభాగం వద్ద పేర్లు నమోదు చేసుకునేందుకు బారులు తీరిన రోగులు

- ఖమ్మంలో 74,960 మందికి వైరల్ ఫీవర్
- జిల్లా వ్యాప్తంగా 243 డెంగీ కేసుల నమోదు
- అనధికారిక లెక్కలు మరింతగా ఉండే ప్రమాదం
- కిక్కిరిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లోపించిన పారిశుధ్యం
- శానిటేషన్ లేకపోవడమే కారణమంటున్న వైద్యులు



# ఫుల్ ఫీవర్

## ఉమ్మడి జిల్లాలో విజృంభించిన జ్వరాలు

ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, జూలై 26 : ఉమ్మడి ఖమ్మం జిల్లాకే జ్వరం వచ్చిన పరిస్థితులు కన్పిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించినా ఖమ్మం జిల్లాలో 74,960 మందికి వైరల్ ఫీవర్ రావడం, జిల్లా వ్యాప్తంగా 243 డెంగీ కేసుల నమోదు కావడం వంటి పరిస్థితులు ఇందుకు అద్దం పడుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రోజూ వర్షం కురుస్తూనే ఉన్నది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా మురుగు గుంతలు కన్పిస్తున్నాయి. వీధుల్లో, ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో దోమలు విపరీతంగా పెరిగాయి. తద్వారా ప్రజలను రకరకాల జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లా వైద్యారోగ్యశాఖ అందించిన గణాంకాల ప్రకారం 74,960 మంది వైరల్ ఫీవర్ బారిన పడ్డారు. వారిలో 10,275 మందికి డెంగీ పరీక్షలు చేయగా 243 మందికి పాజిటివ్‌గా తేలింది. ఇవి కేవలం అధికారిక లెక్కలు మాత్రమే. ప్రైవేట్ దవాఖానల్లో వైద్య సేవలు పొందుతున్న వారి వివరాలన్నీ సేకరిస్తే జ్వర పీడితుల సంఖ్య లక్షల్లో ఉంటుందని వైద్య వర్గాలే అంచనా వేస్తుండడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీల వద్ద ట్రీట్‌మెంట్ పొందుతున్న వారు ఇంకెంత మంది ఉంటారనేది లెక్కిస్తే బాధితులు మరింతగా పెరిగే ప్రమాదం లేకపోలేదు. ఇటీవల అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. వీరిలో నూటికి తొంభై శాతం మంది జ్వర పీడితులే కావడం గమనార్హం. జ్వరపీడితుల తాకిడి కారణంగా తమకు భోజనం చేసే సమయం కూడా ఉండడం లేదంటూ ప్రైవేటు వైద్యులు చెబుతున్న మాటలు జ్వరాల తీవ్రతకు అద్దం పడుతున్నాయి.

### పారిశుధ్యం అస్తవ్యస్తం..

ఖమ్మం జిల్లాలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మధిర, వైరా, సత్తుపల్లి మున్సిపాలిటీలు, మరో 589 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వాటిపై పెద్దగా శ్రద్ధ పెట్టిన దాఖలాలు లేవు. పంచాయతీలకు ఎప్పుడో గడువు తీరిపోవడం, ఇప్పటికీ పాలకవర్గాలు లేకపోవడం, ప్రత్యేక అధికారులకు తలకుమించిన భారం కావడం వంటి కారణాలతో పారిశుధ్యం గురించి పట్టించుకున్న పాపానపోలేదు. బ్లీచింగ్, క్లోరినేషన్, ఫాగింగ్ వంటి వాటి జాడేలేదు. ఇప్పటికే కురుస్తున్న వర్షాలకు ఈ పారిశుధ్య లోపాలు కూడా తోడు కావడంతో ఊరూరా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటి వరకు వెలుగు చూసిన డెంగీ, వైరల్ ఫీవర్ కేసులు గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉండడం గమనార్హం. మరికొన్ని అర్బన్, రూరల్ ప్రాంతాల్లో నెలల వయసున్న చిన్నారులు కూడా జ్వర పీడితులుగా నమోదవుతుండడమే పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.



కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మందుల రూం వద్ద రోగుల క్యూ

### ప్రభుత్వ సేవలు అరకొరే..

వర్షాకాలం సీజన్‌ను, తద్వారా వచ్చే జ్వరాలను రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే అంచనా వేయాలి. జిల్లా వైద్యారోగ్యశాఖతోపాటు మున్సిపల్, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ వంటి కీలక శాఖలను రంగంలోకి దింపి సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయాలి. గత కేసీఆర్ సర్కార్ ముందుగానే ఇంటింటి జ్వర సర్వేను జరిపించేది. వారానికి రెండు దఫాలు డ్రైడేలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించింది. పీహెచ్‌సీల వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది సాయంతో బాధితులకు ఇంటి వద్దే వైద్యసాయం అందించేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. దానితోడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇప్పటికీ కొన్ని రకాల మందులు లేకపోవడం, ప్రభుత్వ సేవలు అరకొరగానే ఉండడం వంటి కారణాలతో జ్వరాల విజృంభణ కొనసాగుతోంది. ఇప్పటికైనా సర్కారు మేల్కొనకపోతే రానున్న రోజుల్లో జ్వరాల తీవ్రత పెరిగే ప్రమాదముందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



### 'భద్రాద్రి'లో రోగుల బారులు

భద్రాద్రి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ రోగులు, జ్వర పీడితులు బారులు తీరుతున్నారు. జిల్లా ప్రధానాసుపత్రితో పాటు రామవరంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం, 29 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు, ఐదు పీపీ యూనిట్లు, మరో ఐదు ఏరియా వైద్యశాలల్లో ఇటీవల జ్వరపీడితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అక్కడ కొన్ని రకాల మందులనే ఇస్తున్న వైద్యులు.. మిగతా వాటిని బయట కొనుగోలు చేసుకోవాలని సూచిస్తుండడం గమనార్హం.



భద్రాచలం వద్ద మళ్లీ పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

# వరద వదలదే...

## భద్రాచలం వద్ద రాత్రి 9.15 నిమిషాలకు మళ్లీ రెండో ప్రమాద హెచ్చరిక జారీ

### ముంపు మండలాల ప్రజలకు తప్పని తిప్పలు

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 26 (నమస్తే తెలంగాణ) : గోదావరి వరద భద్రాచలం పట్టణాన్ని వదలడం లేదు. వారం రోజుల నుంచి మొదటి ప్రమాద హెచ్చరికను వదిలే అవకాశం ఇవ్వడం లేదు. తగ్గుతూ.. పెరుగుతున్న వరదను అంచనా వేస్తున్న అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకుంటున్నా.. మళ్లీ వరద ప్రవాహం పెరగడంతో రెండుసార్లు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. మరోసారి కూడా రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. భద్రాచలం వద్ద ప్రస్తుతానికి 47 అడుగులు దాటి వరద ప్రవాహం కొనసాగుతోంది. గురువారం రాత్రి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసినా.. శుక్రవారం ఉదయం నుంచి వరద తగ్గుముఖం పట్టింది. మళ్లీ మధ్యాహ్నం నుంచి అంగుళం చొప్పున పెరుగుతూ వస్తోంది. రాత్రి 9.15నిమిషాలకు అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారు.

**ఎగువన వర్షాలతోనే..**

ఎగువన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్నందున గోదావరిలో మళ్లీ వరద పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతోపాటు జిల్లాలో కూడా అక్కడక్కడా చెదురు మదురు వర్షాలు కురుస్తున్నాయి. తాలిపేరు వద్ద కూడా వరద ప్రవాహం పెరుగుతోంది. మరోవైపు పేరూరు వద్ద వరద నీరు భారీగానే చేరుతోంది. దీంతో శనివారం మళ్లీ గోదావరి నీటిమట్టం పెరిగే అవకాశాలు లేకపోలేదంటున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

# నకిలీ ఎంపీడీవో అరెస్టు

## ట్రస్టు పేరిట మోసాలకు పాల్పడుతున్న వైనం

### ఇండ్లు కట్టిస్తానని చెప్పి డబ్బు వసూళ్లు

పెనుబల్లి, జూలై 26 : తాను ఎంపీడీవోనని చెప్పుకుంటూ పేదల నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని ఖమ్మంజిల్లా పెనుబల్లి మండలంలోని వీఎం బంజర పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్సై ఎం.వెంకటేష్ తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా వీర్లపాడు మండల కేంద్రానికి చెందిన అద్దంకి దయాకర్‌రావు తాను మచిలీపట్నం ఎంపీడీవోనని చెప్పుకుంటూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలను మోసం చేస్తున్నాడు. నిరుపేదలకు గూడు కల్పించడమే తన లక్ష్యమంటూ ఆంధ్రప్రదేశ్ మాజీ న్యాయసలహా మండలి నిపుణుడు, స్వర్గీయ పాటిబండ్ల చంద్రశేఖర్‌రావు పేరిట ఓ ట్రస్టు ఏర్పాటు చేసుకున్నాడు. దీనిలో భాగంగా పెనుబల్లి మండలం పాతకు ప్పెనకుంట్ల గ్రామంలో ట్రస్టు తరపున ఇళ్లు కట్టిస్తానని చెప్పి 20మందిని ఎంపిక చేశాడు. దీనికి సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి చేతులమీదుగా ఈ నెల 8వ తేదీన శంకుస్థాపన సైతం చేయించాడు. అయితే గ్రామానికి చెందిన నారపోగు శ్రీనివాసరావు, నారపోగు రవికుమార్, కంటేపుడి ఏసు, నారపోగు నాగరాజు ఒక్కొక్కరు రూ.4 వేలు చెల్లించాలని చెప్పి రూ.16 వేలు వసూలు చేశాడు. దీంతో దయాకర్‌రావు ప్రవర్తనపై అనుమానం వచ్చిన గ్రామస్తులు ఎమ్మెల్యే రాగమయికి ఫిర్యాదు చేయడంతో విచారణ చేయాలని పోలీసులకు ఎమ్మెల్యే సూచించారు. అదేవిధంగా నారపోగు శ్రీనివాసరావు వీఎం బంజర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు నకిలీ ఎంపీడీవో దయాకర్‌రావును అరెస్టు చేశారు. అతడిపై 1992 నుంచి అనేక చీటింగ్ కేసులు నమోదయ్యాయని, వాటిలో కొన్ని నందిగామలో, వీర్లపాడులో రెండు, పిడుగురాళ్లలో ఒకటి, ఇబ్రహీంపట్నంలో ఒకటి, ఖమ్మం రూరల్‌లో ఒకటి, తిరువూరులో ఒకటి మొత్తం 8 కేసులు నమోదైనట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు నకిలీ ఎంపీడీవోను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రస్టు పేరిట ప్రజాసేవ చేస్తున్నట్లు చెప్పుకుంటూ మోసాలకు పాల్పడేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.



నకిలీ ఎంపీడీవో అరెస్టు చూపుతున్న వీఎం బంజర పోలీసులు

# గంజాయి రహిత జిల్లాగా మార్చాలి

## భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, జూలై 26 : భద్రాద్రిని గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా సహకరించాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైనా నిషేధిత గంజాయిని రవాణా చేస్తున్నా, విక్రయిస్తున్నా లేదా సేవిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని కోరారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో యువకులు గంజాయి సేవించే ప్రదేశాలను గుర్తించామని, ఎవరైనా గంజాయి సేవిస్తూ కనిపిస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జల్లాలో గంజాయి రవాణాను నివారించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని ఎస్పీ పేర్కొన్నారు.



ఎస్పీ రోహిత్ రాజు

# 'నాస్'లో సత్తా చాటాలి

## భద్రాద్రి డీఈవో వెంకటేశ్వరాచారి

కొత్తగూడెం టౌన్, జూలై 26 : నవంబర్‌లో జరగబోయే జాతీయ సాధన సర్వే(నాస్)లో జిల్లా విద్యార్థులు సత్తా చాటాలని, అందుకు అనుగుణంగా బోధనాభ్యసన ప్రణాళికలను రచించుకొని పకడ్బందీగా అమలు చేయాలని డీఈవో వెంకటేశ్వరాచారి ఉపాధ్యాయులకు సూచించారు. సంసిద్ధతలో భాగంగా జిల్లాలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన తెలుగు, ఆంగ్లం, గణితం ఆర్పీలకు కొత్తగూడెంలో శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021లో నిర్వహించిన జాతీయ సాధన సర్వేలో భద్రాద్రి జిల్లా రాష్ట్రంలోనే 25వ స్థానంలో నిలిచిందని, ఈ ఏడాది జరగబోయే సర్వేలో జిల్లాను మొదటి పది స్థానాల్లో నిలపడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఫైనాన్స్ అధికారి శ్రీనివాసరావు, అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరాచారి

# మెరుగైన విద్యను అందించాలి

## భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్

### అనంతోగు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల తనిఖీ

ఆళ్లపల్లి, జూలై 26 : ఉపాధ్యాయులు స్థానికంగా ఉంటూ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు నాణ్యమైన విద్యను, మెనూ ప్రకారం భోజనం అందించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. అనంతోగు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులు, కిచెన్ షెడ్, డార్మెటరీ, డైనింగ్ హాల్ పరిసరాలను సందర్శించారు. విద్యార్థులతో భోజనం సరిగా పెట్టడం లేదని తెలుసుకున్న ఆయన వారితో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం వడ్డించడం లేదని, వెంటనే హెచ్‌ఎం బావ్‌సింగ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ డీడీని ఆదేశించారు. కమిషనర్ సూచన మేరకు రాత్రిపూట ముగ్గురు టీచర్లు ఉండి సబ్జెక్టులవారీగా చదివించాలని, ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఒకవేళ అస్వస్థతకు గురైతే వెంటనే పీహెచ్‌సీకి తీసుకెళ్లాలని సూచించారు. తాజా కూరగాయలతో భోజనం వడ్డించాలని, విద్యుత్, తాగునీటి సమస్యలు ఉండొద్దన్నారు. విద్యార్థుల పట్ల అలసత్వం వహించే హెచ్‌ఎం, ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో క్రీడల అధికారి గోపాల్‌రావు, క్రీడా పాఠశాల హెచ్‌ఎం శారద, పాఠశాల సిబ్బంది, కోచ్‌లు మారప్ప, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

# కార్పొరేట్ల కోసమే కేంద్ర బడ్జెట్

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్రి ప్రసాద్

### సత్తుపల్లిలో కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం

సత్తుపల్లిటౌన్, జూలై 26 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ల కోసమే ప్రవేశపెట్టినట్లుగా ఉన్నదని, మరి కష్టజీవులకు బడ్జెట్‌లో కేటాయించింది ఏమిటని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్రి ప్రసాద్, రాష్ట్ర నేత మెరుగు సత్యనారాయణ ప్రశ్నించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా పట్టణంలోని అంబేద్కర్ రింగ్ సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, మహిళా సంఘం, సీఐటీయూల ఆధ్వర్యంలో శుక్రవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మోదీ సర్కార్ మొండిచేయి చూపించిందని, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తొలుత రావి వీరవెంకయ్య భవనం నుంచి రింగ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు మోరంపూడి పాండురంగారావు, మల్లూరు చంద్రశేఖర్, కువ్వారపు లక్ష్మణ్, పాకలపాటి ఝాన్సీ, జాజిరి జ్యోతి, చెరుకు కుమారి, సునందనరావు తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

- తిరుమలాయపాలెం ఆసుపత్రి స్థాయి తగ్గిస్తారంటూ పుకార్లు షికార్లు
- వంద పడకల ఆసుపత్రిపై కొనసాగుతున్న సందిగ్ధత
- స్పష్టత ఇవ్వని స్థానిక మంత్రి, జిల్లా ఉన్నతాధికారులు
- ఉద్యమబాట పట్టిన అఖిలపక్ష పార్టీల నాయకులు, ప్రజలు
- ఆసుపత్రి ఎదుట కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

# ఉంటుందా.. పోతుందా?



తిరుమలాయపాలెం 100 పడకల ఆసుపత్రి



ఆసుపత్రి ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అఖిలపక్ష నాయకులు

తిరుమలాయపాలెం, జూలై 26 : తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి కొనసాగింపుపై ప్రజల్లో సందిగ్ధత నెలకొంది. ఆసుపత్రి స్థాయిని తగ్గించి కూసుమంచికి బదిలీచేసి అక్కడ వంద పడకల ఆసుపత్రి చేపడతారని గత కొన్నిరోజులుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తిరుమలాయపాలెం 100 పడకల ఆసుపత్రిని తరలించడానికి వీలు లేదంటూ ఈ ప్రాంత అఖిలపక్ష పార్టీలు పోరుబాట పట్టాయి. మండలంలోని అన్ని రాజకీయ పార్టీలు ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. గత నాలుగురోజులుగా ఆసుపత్రి ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఇంతా జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, పౌరసంబంధాలశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా వైద్య ఉన్నతాధికారులు ఎవ్వరు కూడా స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చుట్టుపక్కల మండలాలకు కేంద్రంగా ఉండడంతోపాటు పాత తాలుకాగా ఉన్న తిరుమలాయపాలెంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేసింది. గత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తిరుమలాయపాలెం పీహెచ్‌సీ స్థాయిని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసి రూ.4.50 కోట్ల వ్యయంతో నూతన ఆసుపత్రి భవనాన్ని సైతం నిర్మించారు. ఆ తర్వాత ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి మెడికల్ కళాశాల మంజూరుకావడంతో తిరుమలాయపాలెం సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా మారుస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆసుపత్రికి అభివృద్ధికి రూ.30 కోట్లు మంజూరు చేసింది. అనంతరం అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనుల్లో పురోగతి జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి పొంగులేటి చొరవతో తిరుమలాయపాలెం ఆసుపత్రికి ఖమ్మం నుంచి డిప్యూటేషన్‌పై 12 మంది డాక్టర్లు, 23 మంది స్టాఫ్‌నర్సులు, సిబ్బందిని నియమించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. ఇటీవల ఆసుపత్రిని సందర్శించిన మంత్రి పొంగులేటి ఆసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. దీంతో ఆసుపత్రి మరింత అభివృద్ధి చెందుతుందని సంబరపడుతున్న తరుణంలో ఆసుపత్రి స్థాయిని తగ్గిస్తారని వదంతులు రావడంతో ప్రజలు అవాక్కవుతున్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన డాక్టర్ల బదిలీల్లో తిరుమలాయపాలెం ఆసుపత్రి పేరు జాబితాలో లేకపోవడంతో ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్లు ముగ్గురు ఇతర ప్రాంతాలకు బదిలీ కోరుకొని వెళ్లారు. దీంతో ఆసుపత్రిని తరలిస్తున్నారనే ప్రచారానికి బలం చేకూరింది. ఈ విషయమై జిల్లా మంత్రులు లేదా అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన వంద పడకల ఆసుపత్రిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తుందా అంటూ ప్రశ్నిస్తున్నారు. దీనిపై స్పష్టత కోరుతూ ఈ నెల 29వ తేదీన తిరుమలాయపాలెంలో అఖిలపక్ష పార్టీలు భారీ ధర్నాకు పిలుపునిచ్చాయి.

### ఆసుపత్రి స్థాయి తగ్గింపు అవాస్తవం..

తిరుమలాయపాలెం వంద పడకల ఆసుపత్రి స్థాయి తగ్గింపు, తరలింపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. వదంతులు నమ్మొద్దు. ఇటీవల జరిగిన డాక్టర్ల బదిలీల్లో తిరుమలాయపాలెం ఆసుపత్రి పేరు జాబితాలో లేకపోవడంతో ఇక్కడ డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్లు ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లారు. తిరుమలాయపాలెం ఆసుపత్రికి త్వరలోనే కొత్త డాక్టర్లు వస్తారు.

– రాజశేఖర్, డీసీహెచ్‌ఎస్